بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ    نَحْمَدُهٗ وَنُصَلِّيْ عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ    وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ



# పవిత్ర ఖుర్ఆన్, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హదీసులు, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ప్రచనాల ఆధారంగా ప్రచారం గురించి ముఖ్య సూచనలు

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 12.12.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ.
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۝ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ۝ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۝ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۝ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ
نَسْتَعِيْنُ ۝ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۝ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۝

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ అన్నహ్ల్ అధ్యాయపు 126వ సూక్తిని పఠించి దాని అనువాదం తెలుపుతూ ఇట్లు ఉపదేశించారు. దాని అనువాదం ఏమనగా నీవు (మనుజులను) వివేకము, ఉపదేశము ద్వారా తమ ప్రభువు మార్గమునకు ఆహ్వానించుము ఉత్తమ పద్ధతిలో వారితో (వారి వైరుధ్యమును గూర్చి) చర్చించుము. అతని మార్గము నుండి తప్పి పోయిన వారిని కూడ, మార్గ దర్శనము పొందిన వారిని కూడ నీ ప్రభువు బాగుగా ఎరుగును.

పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తఆలా ప్రచారం చేయుటకు అత్యుత్తమ పద్ధతిని ఉపదేశించాడు, తద్వారా ఇతరులపై దాని ప్రభావం కూడా పడుతుంది, దాని ప్రయోజనం కూడా కలుగుతుంది. దీనిని ఆచరించేవారు అల్లాహ్ తఆలా అనుగ్రహంతో చాలా వరకు విజయం సాధిస్తారు. కనుక ఈ సూత్రాన్ని ఎల్లప్పుడూ మనం జ్ఞాపకముంచుకోవాలి. ఈ రోజుల్లో సోషల్ మీడియా కారణంగా ప్రజలు ప్రచారం చాలా సులభమని భావిస్తున్నారు, కానీ ప్రచారానికి కూడా కొన్ని షరతులు, నియమాలు ఉన్నాయి, వాటిని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి, లేదంటే వ్యతిరేక ప్రభావం పడుతుంది. కనుక, మనం చేయబోయే ప్రచారం అత్యుత్తమ పద్ధతిలో ఉండాలి అనే విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి.

ఒకసారి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ప్రచారం గురించి ఒక ముఖ్యమైన మార్గదర్శకాన్ని ఇచ్చారు. ఇస్లామి బోధనల గురించి పూర్తిగా తెలియనివారు, దాని ఉన్నత స్థాయి విశేషాల గురించి ఏమాత్రం తెలియనివారు, ప్రస్తుత కాలపు విమర్శలకు సంపూర్ణంగా జవాబు చెప్పలేనివారు, పవిత్రాత్మ ద్వారా విద్య పొందనివారు మా తరపున ప్రచారకులుగా వెళ్ళడాన్ని నేను ఏమాత్రం సమంజసమని భావించను. నా ప్రచారకులకు అల్లాహ్ తఆలాతో ఒక ప్రత్యేక సంబంధం ఉండాలని, తద్వారా అల్లాహ్ తఆలా వారికి సహాయం చేయునని ఆయన అలైహిస్సలాం అన్నారు.

అల్లాహ్ వైపు ఆహ్వానించుట అనగా ప్రచారం గురించి మనం గుర్తుంచు కోవలసిన మొదటి విషయం ఏమనగా యావత్ ప్రపంచం కొరకు ఉద్దేశించబడిన సందేశాన్ని తెచ్చిన ఏకైక మతం ఇస్లాం

మాత్రమేనని, ఏకైక ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వలసల్లం మాత్రమే అని మనం ఎల్లప్పుడు గుర్తుంచుకోవలెను. అల్లాహ్ తఆలా వారి సల్లల్లాహు అలైహి వలసల్లంను అందరి కొరకు, అన్ని జాతుల కొరకు శుభవార్తనిచ్చే వారిగా, హెచ్చరించే వారిగా పంపాడు. ప్రచారం కొరకు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వలసల్లర కూడా ఆదేశాలు ఇచ్చారని, కొన్ని మార్గదర్శకాలను ఇచ్చేవారని ఎల్లప్పుడూ గమనించవలెను. ప్రజల తెలివితేటల స్థాయికి అనుగుణంగా వారితో మాట్లాడాలని ఒక ఆదేశం ఇచ్చారు. అణచివేయబడిన వ్యక్తి శాపం నుండి తప్పించుకోవలెననే మరొక విషయాన్ని కూడా సూచించారు. ప్రచారం చేసేవారి నడవడిక ఎల్లప్పుడూ మంచిగా, ఉన్నతంగా ఉండాలి, మానవుల హక్కుల ఉన్నత ప్రమాణం పాటించవలెను. ఏ ఒక్క అణచివేయబడిన వ్యక్తి శాపానికి గురి కాకుండా వారుండ వలెను. ఎందుకనగా అణచివేయబడిన వ్యక్తి శాపానికి మరియు అల్లాహ్ తఆలాకు మధ్య ఎలాంటి అడ్డంకి ఉండదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఒక చోట హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇలా ప్రవచించారు. అబద్ధపు ఆరోపణలకు జ్ఞానంతో, మంచి ఉపదేశంతో సమాధానం చెప్పడం మనపై దేవుడు విధిగా చేశాడు. మన ప్రచారం నడవడిక, సత్ప్రవర్తన పరిధిలో ఉండాలని గుర్తుంచుకోవాలి. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం కూడా కఠినంగా వ్యవహరించారని కొందరు అంటుంటారు. మొదటి విషయం ఏమనగా వారు అలైహిస్సలాం కఠినంగా వ్యవహరించలేదు. వారు అలైహిస్సలాం తమ వివిధ పుస్తకాలలో కఠినమైన పదాలను ఉపయోగించకుండా జమాఅత్‌ను నిలువరించారు. కొన్ని నిర్బంధాల కారణంగా కొన్నిచోట్ల ఈ పదాలను నేను ఉపయోగించవలసి వచ్చిందని, ఈ కఠినత్వంలో వారి (విరోధుల) చరిత్ర ఆధారంగా విషయాలను మాట్లాడానని, వారి (విరోధుల) మాదిరిగా తిట్లు, దూషణలతో కూడిన భాషను నేను ఉప యోగించలేదని అన్నారు.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు కూడా اُدۡعُ اِلٰی سَبِیۡلِ رَبِّکَ بِالۡحِکۡمَۃِ "అద్'ఉ ఇల సబీలి రబ్బిక బిల్ హక్మహ్" గురించి తఫ్సీర్ కబీర్‌లో వివరించారు. ముస్లింలు ఈ రహస్యాన్ని అర్థం చేసుకొని ఉంటే యూదుల, క్రైస్తవుల మతాలను తమలో విలీనం చేసుకొనేవారని వారు (ర.అ) చాలా విచారంతో అన్నారు. పవిత్ర ఖుర్‌ఆన్ మన ఆయుధం, దాని గురించి అల్లాహ్ తఆలా ఇలా ఆదేశించాడు: ఈ ఖుర్‌ఆన్ ఖడ్గం తీసుకుని ప్రపంచంలో జిహాద్ కొరకు బయలుదేరుము. కానీ దురదృష్టవశాత్తు ఈ రోజు ప్రపంచంలోని ప్రతిదీ ముస్లింల చేతుల్లో ఉంది, కానీ దేవుడు ఏ ఖడ్గాన్ని తీసుకుని బయలుదేరమని ఆదేశించాడో అది మాత్రం లేదు. ధర్మంలో కేవలం పసలేని నిదర్శనములు మాత్రమే లేవని, ఉపదేశపు విభిన్న కోణాలున్నాయని, వాటిని పాటించవలెననే ఇస్లాం ఈ సందేశాన్ని ప్రపంచానికి తెలియ జేయడం ఇప్పుడు అహ్మదియ్య జమాఅత్ కర్తవ్యం. తరువాత, భావోద్వేగాలను రేకెత్తించే విషయాలను కూడా చెప్పాలని, జ్ఞానంతో పాటు మంచి ఉపదేశాన్ని కూడా చేర్చాలని ఆయన రజియల్లాహు అన్హు అన్నారు.

ఇంకా అల్లాహ్ తఆలా ఇలా ఉపదేశించాడు. మీరు బాగా ప్రచారం చేస్తూ ఉండండి, కానీ ప్రజలు అంగీకరించకపోతే, మాకు ప్రచారం చేయడం రాదని నిరాశ చెందకండి. ఎందుకంటే మీ ప్రచారంలో ఎలాంటి లోపం లేకపోవచ్చు, కానీ సంబోధించబడిన వ్యక్తి హృదయంపై అతని పాపాల వలన అలాంటి తుప్పు పట్టి ఉండవచ్చు, దేవుడు అతనికి మార్గదర్శకత్వపు కిటికీ తెరవడు. సంక్షిప్తంగా, ప్రచారంలో నిమగ్నమై ఉండాలి. ఇదే అసలైన విషయం. మన పని ప్రచారం చేస్తూ ఉండటమే. ఫలితాన్ని నిర్ణయించడం మరియు ప్రభావాన్ని సృష్టించడం అల్లాహ్ తఆలా పని.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇలా ప్రవచించారు. నా మాట వినండి మరియు బాగా గుర్తుంచుకోండి, ఒక వ్యక్తి మాటలు నిజమైన హృదయం నుండి రాకపోతే మరియు అందులో ఆచరణాత్మక శక్తి లేకపోతే, అవి ప్రభావం చూపవు. వారు అలైహిస్సలాం మరొక చోట ఇలా సూచించారు: విశ్వాసి రెండు రకాలుగా ఉండకూడదు. అప్పుడే ప్రచారంలో అనుగ్రహం కలుగుతుంది. ఇంకా వారు అలైహిస్సలాం ఒక చోట ఇలా ఉపదేశించారు. ఒకే మాట ఒక పద్ధతిలో చెప్పినప్పుడు అది ఒక వ్యక్తిని శత్రువుగా మార్చగలదు, అదే వేరే పద్ధతిలో చెప్పినప్పుడు అది స్నేహితుడిగా మార్చగలదు. కనుక, وَجَادِلْهُمْ بِالَّتِيْ هِيَ اَحْسَنُ "వజాదిల్ హుం బిల్ లతీ హియ అహ్సన్" (వారితో అత్యుత్తమ పద్ధతిలో చర్చించు) ప్రకారం తమ ఆచరణ ఉంచుకోండి. ఈ శైలిని దేవుడు జ్ఞానం అని పిలిచాడు.

ఇంకా తరువాత వారు అలైహిస్సలాం ఇలా హితవు పలికారు. మాట్లాడినప్పుడు ఆలోచించి, సంక్షిప్తంగా, పనికి సంబంధించిన విషయం మాట్లాడాలి. కనుక కొన్నిసార్లు ఒక చిన్న అంశం, సామెత చెప్పినప్పుడు, అది నేరుగా చెవిలోకి వెళుతుంది. తరువాత మళ్ళీ అవకాశం వస్తే అప్పుడు చెప్పవచ్చు. సత్య సందేశాన్ని సంక్షిప్తంగా, నెమ్మదిగా అందిస్తూ ఉండాలి, అలసిపోకూడదు. కానీ ఈ రోజుల్లో ప్రజలు ప్రపంచ ఆలోచనల్లో మునిగిపోయారు, వారికి అర్థం చేయించడం కష్టం. మన ఆచరణాత్మక ఉదాహరణలు ఉంటే, ప్రజల దృష్టి కూడా మన వైపుకు ఆకర్షించబడుతుంది. వారు అలైహిస్సలాం ఇలా అన్నారు. గుర్తుంచుకోండి, ప్రతి తాళానికి ఒక తాళంచెవి ఉంటుంది. మాటకు కూడా ఒక తాళంచెవి ఉంది, అదే తగిన శైలి. అందరితో ఒకే విధంగా మాట్లాడకూడదు. చెప్పేవారు ఎవరైనా చెడుగా మాట్లాడినందుకు బాధపడకూడదు, కానీ తమ పని చేసుకుంటూ పోవాలి, అలసి పోకూడదు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం తమ జమాఅత్‌నకు ఇట్లు మార్గదర్శనం చేశారు. నమాజ్, ఉపవాసం, హజ్ మరియు జకాత్ (దానం) ఇస్లాం ఆదేశాలు, వీటిని ప్రతి కాలం లోనూ ఆచరించడం అవసరం, ఇదే విధంగా జిహాద్ కూడా ఇలాంటి ఆచరణలలో ఒకటి, దీనిని ప్రతి కాలంలోనూ ఆచరించడం అవసరం, మీ కలం ద్వారా చేయబడే జిహాద్ మాత్రమే ఇప్పుడు మీ జిహాద్ అనబడుతుంది. ఈ విధంగా కలంతో జిహాద్ చేసి ప్రపంచానికి ఇట్లు తెలియజేయాలి. అనగా ఒక వైపు వారు మసీహ్ మరియు మహ్దీ రావాలని అంగీకరిస్తారు, మరో వైపు అంగీకరించకుండా నిరాకరిస్తారు. మనం వారి వాదనలను కేవలం భాషాపరమైన అర్థాలు మరియు వివాదాలలోకి తీసుకువెళితే, దాని వల్ల ఎలాంటి

ప్రయోజనం ఉండదు. ప్రపంచవ్యాప్తంగా ఇస్లాంకు విజయాన్ని అందించడమే మన ప్రధాన లక్ష్యం అని వారితో చెప్పాలి, ఎందుకంటే హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మనందరికీ మరియు ప్రపంచం మొత్తానికి ప్రవక్త మరియు సందేశహరునిగా అవతరించారు. ఈ రోజు మన సంఖ్య ప్రపంచ జనాభాలో నాలుగో వంతు కంటే కూడా తక్కువగా ఉంది. మనం ప్రపంచాన్ని ఇస్లాం పతాకం నీడన తీసుకొనిరానంత వరకు మనం చాలా పని చేశామని ఎలా చెప్పుకోగలం? ఈ రోజు ఈ రకమైన జిహాద్ చేయడం మన బాధ్యత. అప్పుడే మన జిహాద్ విజయవంతమవుతుంది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. మురబ్బీలపై (ప్రచారకుల)పై చాలా పెద్ద బాధ్యత ఉందని నేను వారికి చెప్పదలచతిని. వారు జమాఅత్‌నకు కేవలం శిక్షణ ఇవ్వడమే కాదు, ఆ శిక్షణతో పాటు సభ్యులను అల్లాహ్ తఆలాతో అనుబంధంలో పెంచుటకు కృషి చేయవలెను. వారు ఇది చేస్తునప్పుడు, వారి జ్ఞానాన్ని కూడా పెంచాలి మరియు ఈ జిహాద్ కొరకు వారిని సిద్ధం చేయాలి. వారు ఇది చేసినప్పుడే తమ వాగ్దానాన్ని నెరవేర్చినవారు అవుతారు.

ముగింపులో హుజూరె అన్వర్ వివిధ సందర్భాలలో హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్‌హు మురబ్బీలకు ఇచ్చిన ఉపదేశాల నుండి ముఖ్యమైన విషయాల సంక్షిప్త సారాంశాన్ని అందించారు. వాటిలో ఆత్మ శుద్ధి, తహజ్జుద్ నమాజును సలపడం, పవిత్ర ఖుర్‌ఆన్‌ను లోతుగా అధ్యయనం చేయడం, దైవస్మరణ మరియు పుస్తక పఠనం అలవాటు ఉండాలి, అల్లాహ్ తఆలాపై నమ్మకం చాలా ఎక్కువగా ఉండాలి. పొగడ్తలకు లొంగేవారుగా ఉండకూడదు, ఇలాగే ప్రజలతో సంబంధాలను మెరుగుపరుచుకోవాలి. ఇంకా చెడును ధైర్యంగా ఖండించే మరియు స్థిరత్వంతో కూడిన అలవాటు ఉండాలి. మురబ్బీలు స్వయంగా ఆచరిస్తున్నప్పుడు, ఈ స్ఫూర్తి ఖచ్చితంగా జమాఅత్‌లో కూడా ఏర్పడుతుంది. ఇలాగే లోతుగా ఆలోచించే అలవాటు మరియు అల్లాహ్ తఆలాతో సంబంధం కూడా ఉండాలి. ఇది ఉన్నప్పుడే మనం ఒక గొప్ప విప్లవాన్ని సృష్టించగలం. అల్లాహ్ తఆలా అందరికీ దీనిని పాటించే శక్తిని ప్రసాదించుగాక! అల్లాహ్ వైపు ఆహ్వానించేవారికి కూడా సరైన జ్ఞానాన్ని పొందడానికి శక్తిని ప్రసాదించుగాక! అల్లాహ్ తఆలాతో సంబంధాన్ని ఏర్పరచుకొని, తరువాత ఇస్లాం, అహ్మదియ్యత్ సందేశాన్ని ప్రపంచంలోని ప్రతి మూలకు చేరవేసేవారు అవుదురుగాక!

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ - وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا - مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ - وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ - عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ - يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ - اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ -